# డ్రీమ్స్ |

స్వీట్ హోమ్‌కి డోర్ నంబర్లు లేవు. అసలా శాల్తీ వుందో లేదో ఎవరూ గట్టిగా చెప్పలేరు. నేను చిన్నప్పుడు పకోడీలు చెట్టున కాస్తాయనుకునేదాన్ని! మా యిల్లు స్వీట్ హోమ్ మా యింటికి రండి అని గుండెమీద చెయ్యేసుకుని చెప్పకలిగిన ఆడదికాని మగాడుకాని నాక్కనిపించలేదు. కనుక స్వీట్ హోములు లేవని కొట్టిపారేద్దామా— కొట్టిపారేస్తే గృహరాక్షసి, గృహపిల్లి, గృహకోతి ఆగ్రహిస్తే తట్టుకో వద్దూ.... (పాపము శమించుగాక).

"నీ నీడలోనే మేడకడతా నాయుడుబావ" అందిట ఎంకి. అంటే అందికాని "మేడ కట్టినవాడు కూడబెడతాడు, కూడబెట్టినవాడు మేడకడతాడు" అన్నాడో కవిరాక్షసుడు.

కొత్తగా పెళ్ళయి కువకువలాడే నవజంటను పిలిచి మీకు స్వీట్ హోమ్ కావాలా అంటే "చాక్లెట్లతోనూ, చెఱకుగడలతోనూ, బెల్లపు దిమ్మలతోనూ కట్టిన ఇల్లు మాకక్కర్లేదు. వుయ్ డోంట్ కేర్ —వుయ్ వాంట్ అట్‌లీస్టు వన్ సింగిల్‌రూం విత్ బాత్ అటాచ్‌డ్ అంటారు." సింగిల్ రూం సింగిల్ బెడ్ అంతా వెరీ సింపుల్‌గా వుండాలంటారు. మనవో— యిప్పుడు మనల్ని మొహవాటంపెట్టి ఎవరైనా టు హెల్ ఆర్ హెవెన్ తీసికెళ్ళినా, అక్కడ రుబ్బురోలు, ఆవకాయ కత్తిపీట వుందో లేదో అని వెతుక్కుంటాను నేను. యమదూతలుకాని విష్ణుదూతలుకాని మా వీధిగుండా ఎవరింటికి బయల్దేరినా (కీడెంచి మేలెంచాలి) దారి అడ్డంకొట్టి మావారు బ్రిడ్జికాని రమ్మీకాని ఆడుదాం రమ్మని పిలుస్తారు. యమదూతలు పెద్ద పెద్దకోరలూ వాళ్ళూ బయల్దేరి అర్జంటు

పనిమీద (ప్రాణం పోతున్నట్లుకాదు)వచ్చారనుకోండి! మా హీరోవాళ్ళకు క్రికెట్ కామెంటరీ పెట్టి మేచ్ అయ్యేదాకా మాట్లాడొద్దంటారు. ఎంతకూ వీళ్లు రాలేదుకదా అని యం. ధర్మరాజు తనే స్వయంగా దున్నపోతుమీద వస్తే గిస్తే-- వాడికి మా వీధిలో విమల రాసిన పోటీ నవల తెచ్చి చదివి వినిపిస్తే "మళ్ళీ వస్తా"నని చెప్పి పుంజాలు తెంపుకుపారిపోవలసిందే! బైగాడ్ చెబుతున్నా— (బ్రాందీ మహాత్మాకి జై అంటూ మావారు మద్యప్రదేశ్‌కి వెళ్ళకుండా వుంటేచాలు—). మర తిప్పగానే పంపులోంచి కాఫీ వస్తే మాకిద్దరికీ చాలు, సరిపోతుంది. కరివేపాకు చెట్టున రిబ్బన్లు కాస్తే నేనూ, పచ్చిమిరపమొక్కకు బర్కిలీ సిగిరెట్లుకాస్తే మావారూ తప్పక సంతోషిస్తారు. దట్సాల్— మొన్న మొన్న జిలేబీల అడవిలో నేను తప్పిపోయినట్లు, అప్పుడు మరమరాల వర్షంకురిస్తే అప్పడాల అంబరిల్లా వేసుకుని నేను తిరిగినట్టూ నాక్కలొచ్చింది. (వ్వాట్ సార్! రాకూడదా.... ) ఐస్ క్రీం నదిమీద బిస్కట్లతో వంతెనకడితే ఎలా వుంటుంది? పటికబెల్లం పర్వతంమీద మైసూరుపాక్‌తో మేడకట్టినట్లుంటుందా? సిల్లీ గరల్, నీ నీడలోనే మేడ కడతానంటుంది ఎంకి. దాని టెంకిమీద రెండు తగల్నిస్తే బ్రాందీ మహాత్మాకీ జై అంటూ పరిగెడుతుంది. సుబ్బారావుగారికి తెల్సో తెలియదో కాని నాయుడు బావ బ్రాందీ మహాత్ముడే— అడపా తడపా రెండు తగల్నిస్తాడట ప్రేమకాస్త గట్టిపడటాన్కి. సారా సారములెరిగినవారికి బ్రాందీ మహాత్ములకి అహింసంటే పడదు. దే డోంట్ కేర్— ఏవండీ గురూగారూ— ఇండియాకి మగాడు ప్రెసిండెంటయితే రాష్ట్రపతి అంటారుకదా. ఆడది (స్వీట్ హోమ్‌నొదిలేసి) ఇండియాకు ప్రెసిడెంటయితే రాష్ట్రభార్య అంటారా? ప్రతి భార్యా ఒకరికి తల్లి ( ఇప్పుడు కానక్కరలేదు ఫామిలీ ప్లానింగొచ్చాక) ప్రతి తల్లీ ఒకరికి భార్యకనుక రాష్ట్ర భార్య అంటే రాష్ట్రవ్యాప్తంగా కల్లోలంవచ్చే ప్రమాదం వుంది కాబట్టి "రాష్ట్రమాత" అని అంటారని ఆశిద్దాం. సబుకో సన్మతి దే భగవాన్! రాష్ట్రమాతకు

ప్రధానమంత్రికి కూడా బెల్లపు దిమ్మల స్వీటు హోములు లేవు. పార్లమెంటు, ప్రభుత్వకార్యాలయాలు, మినిస్టర్ల కొంపలు, అవినిజంగా హాట్ హాట్‌హోమ్స్. హాట్ హోమ్స్‌లో అప్పుడప్పుడు స్వీట్ బెడ్స్ వుంటాయి. స్వీట్‌హోమ్స్‌లో హాట్ బెడ్స్ ఏర్పడ్డంకద్దు. సానికొంపల్ని పూర్వం స్వీట్ హోమ్స్ అనుకొని భ్రమపడి ఇల్లూ ఒళ్ళూ గుల్ల చేసుకొన్నవారి స్టోరీలు చదివాం— సిన్మాలు చూశాం, నాటకాలు ఆడాం. నిజంగా మనకు కావలసినవి హాట్ హోమ్స్ కాదు నార్మల్ హాపీ హోమ్స్. హాపీ హోమ్‌కి స్వీట్ హోం పర్యాయంకాదు.

ఎటువంటి లక్షణాలుకలిగినకొంప హాపీ హోమనబడును అనగా హాపీనెస్ (సుఖం) "ఈపాటి సుకము నేనింతవర కెరగనే" అనిపించేటువంటి సమయాల్లో, ఆ కొంప, లేదా ఆ చోటు అది చెట్టుక్రిందైనా సరే హాపీ హోమనబడదగదే. అది ముప్ఫయిపన్నెండంతస్తుల భవనమైనా సరే— అందులో తొంభయిపదకొండు ఎయిర్‌కండిషన్డు గదులున్నాసరే, గదిలో సముద్రవంత బెడ్డున్నా, మీట నొక్కితే చంద్రుడు వెలిగినా, మనుషుల మనసులలో ఆ స్పార్కు, ఆ ఫ్లేమ్ (జ్యోతి) వెలక్కపోతే వాళ్ళ బ్రతుకు "సందులలో పందులవలె" కొడిగట్టిన దీపంలాగుంటుంది. అటువంటి దంపతులు హాపీహోమ్‌లు కట్టజాలరు. సె కాంట్.

సుఖానికి మనం ఇచ్చే డెఫినిషన్ అనగా నిర్వచనాన్నిబట్టి మన హాపీహోమ్ యివాళ లబ్బీపేటలోవుంటే రేపు సూర్యారావుపేట ఎల్లుండి సత్యనారాయణపురం ఆ పైన కృష్ణలంకలోనో వుంటుంది.

ఆడదానికి జీవితమంటే అప్పడాలూ ఒడియాలూ కందిపచ్చడి రుబ్బుకోడం, మొగుడూ పిల్లలూ చేంతాడూ చీపురు కట్టా యింతేగా— ఎమ్మే ప్యాసయినా ఫస్టు ఫారం ఫేలయినా పురుడోసుకోక తప్పదు. మొగుడితో కాపరం చేయకా తప్పదు. (స్వీట్ హోం కాకపోయినా) ఎఫెక్షన్స్ ఫేడయాక వెలిసిపోయిన చీర కట్టుకు యింట్లో తిరిగినట్లు మగాడితో ఆడది ఆడదాన్తో మగాడు కాపురంచేయడాన్ని, ఆ వెనక్కాల

త్తై తెక్కలాడే సొసైటీని, సొసైటీలోని శక్తుల్నీ గమనించకుండా బెల్లపు దిమ్మలలో స్వీట్ హోమ్స్‌కట్టి మధురమైన జీవితాల్ని వూహించుకుని ఆ కస్సా చెప్పి రంజింపచేయాలనే మనస్తత్వాన్ని ఐ హేట్ వెరీమచ్. ది సీజాల్ పలాయనిజం — ఊహా ప్రేయసులు ఊహా ప్రియులు ఊహా ముండలు ఎక్కువైనకొద్ది జనం డంజన్‌లో లివింగైనా, దే డ్రీం డే డ్రీమ్సు. ఈ డే డ్రీమర్సు ఆల్ ఆర్టును రైటింగ్ ఎట్సెట్రాలను కంపు కంపుచేసేస్తారు. చూడండి సత్తుగిన్నెలో మజ్జిగపోసి మర్చిపోయి నట్లు జీవితం కంపెత్తిపోతూంటే, కథానాయిక రెండు జడల్నూ వగైరా వగైరాల్ను చూపించి పాఠకుని డామ్ ఫూల్స్ చేయడం నాస్టీ ఆచారమై పోయింది మన కంట్రీలో. చంటిపిల్లకి కడుపునొప్పిగావుంటే సుఖంగా మోషనయితే చాలు అది ఆడుకుంటుంది. తాతయ్యకు చుట్ట మాటి మాటికీ ఆరకుండా వెలిగితే గుప్పు గుప్పుమంటూ రైలింజన్లా పొగ వస్తే సుఖంగా వుంటుంది, తమ్ముడికి యిరవై పంధొమ్మిదులదాకా ఎక్కాలు వస్తే బాగుంటుంది. అత్తయ్య కట్టెలు పొడిగా వుండి మంట బాగా మండితే సంతోషిస్తుంది. అప్పలనరసమ్మకు అంట్లుమాడకుండా వుంటే హాయిగా తోమేస్తుంది. మా అంకుల్కి ఫస్టుతారీకు వారానికోమాటువస్తే బావుంటుంది. డాక్టర్లకి రోజూ పేషంట్లు వస్తే నిత్యపండగ్గావుంటుంది. పేషంట్లకు డాక్టర్లమొహం చూడకుండావుంటే బాగుంటుంది. ఈ బాగో గులు సుఖదుఃఖాలూ ఎవరివి వారివే—

“నీ దుఃఖం నీదే — నా సుఖం నాదే” అనే మెంటాలిటీని పీక పిసికి చంపెయ్యాలి. గొప్పవారి వినయం ఆహ్లాదకరమేగాని, కొద్ది వారి అహంకారం చెడ్డ అగ్ని ప్రమాదకరం— అజ్ఞానులలోని అహంకారాన్ని తరిమి తరిమికొట్టాలి.— (పిచ్చికుక్కని తరిమి తరిమి కొట్టినట్లు) ఎందు కొచ్చిందిలెస్తురూ, మనవేమన్నా శానిటరీ డిపార్టుమెంటా, పిచ్చాసు పత్రి ఉద్యోగులమా అనుకుంటే— సరే. “లోకములో యొకడుండును, వాని బిచ్చి వానికానందము” అని కవి సమ్రాట్టుగారి ఫక్కీలో — వాడి

కర్మ వాడే అనుభవిస్తాడు. చేసుకున్నవారికి చేసుకున్నంత అని పూరుకున్నంత వుత్తమంలేదు.

ఆ రోజుల్లో నేను పకోడీలు చెట్టున కాస్తాయనుకునేదాన్ని! ఇప్పుడు నాకు డే డ్రీమ్స్ రావు. పకోడీలు సెనగపిండితో చేస్తారనీ ఉల్లిపాయలు పచ్చిమిరపకాయలూ బాణలినిండా మరిగిన నూనె ఖరీదు, కుంపట్లో కణకణలాడే బొగ్గుల్లా మండిపోతోందనీ తెలుసు. ఇంట్లోకి పాం ప్రవేశించినట్లు జీవితంలోకి భయం సర్ సరా— సర్ సరా చొచ్చుకు వస్తోందనీ తెలుసు. పురుషోత్తముడు జీతపురాళ్ళను తెచ్చిపడెయ్యడానికి గిలగిలా కొట్టుకుంటున్నాడనికూడా తెలుసు.

ఇప్పుడు పటికబెల్లపు పర్వతంమీద మైసూర్‌పాక్ ఇటికల్తో మేడ కట్టలేను. ఐస్ క్రీం నదిమీద బిస్కట్లతో వంతెనా కట్టలేను. జిలేబీల అడవిలో మరమరాల తుఫాను వస్తే — అదేమో నాకు తెలీదు. మావారు వానలో కాస్త తడిసొస్తే చాలు, తుమ్ములొస్తాయని జలుబు పదిలంఖణాల పెట్టనీ తెగగోల చేస్తాను. మా ఇల్లు స్వీట్ హోం కాదు. మావారు చాలా యాంగ్రీ ఆబ్సెంట్ మైండెడ్ పరమ వేదాంతిక్ టైప్ — వుయ్ క్వారల్, వుయ్ షవుట్ ఆల్ టైమ్! కాని ఎవరి గొడవ వారిది — వుయ్ మైండ్ అవర్ ఓన్ బిజినెస్. వుయ్ డోంట్ కేర్! మా జీవితంలో సుఖమయమైన క్షణాలులేవనీ, యికముందు వుండబోవనీ మేం అనుకోటంలేదు. కాని స్వీట్ హోములు ఏ టైపు బీ టైపు సి టైపులో కడ్తారన్నా నేను నమ్మలేను. ఆసలా బ్లూ ప్రింటు నేనొప్పుకోను. హాపీ హోమ్స్ అన్ హాపీ హోమ్స్ మరియు చెడగా చెడగా కాపురములు కావు. శ్రీరాముడిది స్వీట్ హోమ్‌కాదు. శ్రీకృష్ణుడిదంతకంటె కాదు. మేనకా విశ్వామిత్రులదీ కాదు. శకుంతలా దుష్యంతులది అసలే అది కాదు. పోనీ గాంధీ, జవర్లాల్, లాల్ బహదూర్, ఇందిరాగాంధీ వీరెవరికీ స్వీట్ హోమ్స్ సప్లయికాలేదు. అంటే యిది శుద్ధ దగాకోరు దండగ బిజినెస్సన్నమాట. ఈ చతురంబోధి పరీత భూవలయంలో

లైలా మజ్నూలకి, రోమియో జూలియట్లకి, దేవదాసు పార్వతులకి దొరకని స్వీట్ హోమ్, సుందరీ సుబ్బారావులకు దొరుకుతుందని ఎవరేనా ఆశపెడితే, ఉకిట్ యీజీ— వాళ్ళ కళ్ళల్లోనే ఆశకురుపులు లేస్తాయి. ఈ ఎర్తనే ప్లానెట్టే ఒక అన్ హేపీ హాట్ హోమ్ ఫరాలాఫజ్!!!